**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 26.02.2025** **సమయం : 18.10 గంటలు**

**<u>ముఖ్యాంశాలు</u>**

**1. మెట్రో రైల్ ఫేజ్ -2, రీజనల్ రింగ్ రోడ్, డ్రై పోర్ట్, సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు.**

**2. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల ఆచూకీ ఇంకా తెలియలేదు. సహాయ రక్షణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.**

**3. రేపు జరిగే మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.**

**4. హైదరాబాద్ లో ముగిసిన 22వ బయో ఆసియా శిఖరాగ్ర సదస్సులో 11 వేల కోట్ల రూపాయల మేర పెట్టుబడి హామీలు రాగా, తద్వారా 22 వేల ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.**

**<u>CM:</u>**

**హైదరాబాద్ సమీపంలో RRR ప్రాజెక్ట్ దక్షిణ కారిడార్‌కు అనుమతి ఇవ్వాలని, మూసి పునరుజ్జీవన ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని, ప్రాంతీయ రింగ్ రైలు, డ్రై పోర్ట్ ప్రాజెక్టులను ఆమోదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఈరోజు రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు, సీనియర్ అధికారులతో కలిసి ఢిల్లీలో ప్రధానమంత్రిని కలుసుకున్నారు. 76.4 కిలోమీటర్ల మెట్రో రైలు ఫేజ్-2 కింద ఐదు కారిడార్ల అభివృద్ధికి 24 వేల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరినట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాంతీయ రింగ్ రోడ్డు దక్షిణ కారిడార్‌కు అనుమతి ఇవ్వాలని ఆయన కేంద్రాన్ని కోరుతూ... ఉత్తర కారిడార్ కింద 90 శాతం భూసేకరణ**

పూర్తయిందని తెలియజేశారు. భూసేకరణ ఖర్చులో 50 శాతం రాష్ట్రం భరిస్తుందని కూడా రేవంత్ రెడ్డి ప్రధానమంత్రికి తెలియజేశారు. ప్రాంతీయ రింగ్ రైలు ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తూ, ఈ ప్రాజెక్టు రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుందని కనుక అనుమతి ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓడరేవులకు అనుసంధానించే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, RRR సమీపంలో డ్రై పోర్టు నిర్మాణాన్ని కూడా ఆయన ప్రతిపాదించారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులను దృష్టిలో ఉంచుకుని 29 అదనపు IPS అధికారుల పోస్టులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని అభ్యర్థించారు. రాష్ట్రంలో ఉన్న అనుకూలమైన పరిస్థితుల దృష్ట్యా ఇండియా సెమీ-కండక్టర్ మిషన్ ప్రాజెక్ట్ ను చేపట్టడానికి కూడా అనుమతులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు.

**TUNNEL:**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ఎస్ఎల్‌బిసి సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను చేరుకోవడంలో సహాయక రక్షణ బృందాలు మరింత పురోగతి సాధించాయి. భారీ రాళ్ళు, బురదతో పాటు అంధకారంలో ఉన్న యంత్రాలను చిత్రీకరించి వీడియోను అధికారులకు పంపారు. సొరంగంలో చిక్కుకున్న వ్యక్తుల ఆచూకి ఇంకా తెలియవలసి ఉంది. ఇలా ఉండగా, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ ఉదయం సొరంగ నిర్మాణ నిపుణులతో పరిస్థితిని సమీక్షించారు, రెస్క్యూ బృందాలు ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్ట్ లో చిక్కుకున్న వారిని చేరుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. న్యూఢిల్లీ నుండి, సరిహద్దు భద్రతా దళం బిఎస్ఎఫ్ నుండి కొత్త నిపుణుల బృందాలు కూడా సహాయక రక్షక పనులలో పాల్గొనేందుకు సొరంగం వద్దకు చేరుకున్నాయి. ఇలా ఉండగా, రేపు సహాయ రక్షణ పనులను ఉధృతం చేస్తామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సహాయ రక్షణ బృందాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందు వల్ల ఇప్పటి వరకు రక్షణ పనులు నెమ్మదిగా జరిగాయని రేపు రక్షణ పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి చెప్పారు.

సౌండ్ బైట్ … ఉత్తమ్ కుమార్ రెడ్డి

**BRS:**

ఎస్ఎల్బీసి సొరంగంలో కార్మికులు చిక్కుకుపోయి ఇబ్బంది పడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. సొరంగం వద్ద పని చేస్తున్న వారి ప్రయోజనాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, సహాయక రక్షక పనులు వదిలిపెట్టి ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారని ట్విట్టర్ వేదికగా తారక రామారావు ఆరోపించారు.

**MAHA KUMBH:**

ప్రయాగరాజ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం మహా కుంభమేళా ఈరోజు మహాశివరాత్రి సందర్భంగా ముగుస్తుంది. గంగా, యమునా, సరస్వతి నదుల సంగమ క్షేత్రమైన త్రివేణి సంగమంలోని వివిధ ఘాట్లలో లక్షలాది మంది భక్తులు, యాత్రికులు పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు, జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళాలో ఇప్పటి వరకు 64 కోట్ల 60 లక్షల మందికి పైగా భక్తులు స్నానాలు చేశారు. 144 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే సంభవించే అరుదైన ఖగోళ కూటమి సందర్భంగా ఈ సంవత్సరం మహా కుంభమేళాను ప్రత్యేకంగా నిర్వహించారు.

**MLC:**

తెలంగాణ శాసనమండలి మూడు నియోజకవర్గాలకు రేపు ఎన్నికలు జరుగుతాయి. వచ్చే నెలలో సిట్టింగ్ సభ్యుల పదవీకాలం ముగియనున్నందున నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గం, కరీంనగర్ - మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరుగుతున్నాయి. రేపు పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య జరుగుతుందని మా కరీంనగర్ ప్రతినిధి సంపత్ కుమార్ తెలిపారు.

(వాయిస్‌కాస్ట్-కరీంనగర్, పిటిసి)

కాగా, నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో పోలింగ్ ఏర్పాట్ల గురించి మా నల్గొండ ప్రతినిధి రామకృష్ణ అందిస్తున్న వివరాలు.

(వాయిస్‌కాస్ట్-నల్గొండ, పిటిసి)

**BIO ASIA:**

22 వేలకు పైగా ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉన్న జీవ శాస్త్రాల రంగంలో రాష్ట్రానికి సుమారు 11 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఖరారు అయింది. నిన్న హైదరాబాద్‌లో ప్రారంభమైన లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ ఫోరం బయో ఆసియా 2025 సదస్సులో ఈ మేరకు ప్రకటనలు చేశారు. బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, హెల్త్ కేర్, టెక్నాలజీలో పరిణామాలను చర్చించడానికి ఏర్పాటైన వార్షిక బయోఏషియా ఫోరం సదస్సులో పరిశ్రమ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, విధాన రూపకర్తలు పాల్గొన్నారు.

ఈ సాయంత్రం ముగిసిన బయో ఆసియా సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్టార్టప్ అవార్డులను ప్రదానం చేశారు. జీవ శాస్త్రాలు, రైతులు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు విశిష్ట సేవలు అందించిన అంకుర పరిశ్రమలకు ఈ అవార్డులు ఇస్తారు. అంతకుముందు మంత్రి అంకుర పరిశ్రమలు, ఫార్మా పరిశ్రమలు, పరిశోధనా ప్రయోగశాలల ఎగ్జిబిషన్ ను తిలకించారు.

**FESTIVAL:**

రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన శైవ క్షేత్రాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అన్ని రంగాల ప్రముఖులు ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయం, వరంగల్ కాశీ విశ్వేశ్వర ఆలయం, హనుమకొండ రుద్రేశ్వర స్వామి ఆలయం వంటి శైవ క్షేత్రాలలో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ప్రజలు ఉపవాస దీక్షను పాటిస్తున్నారు. రాత్రంతా శివుడిని ప్రార్థిస్తూ "జాగరణ" కూడా చేస్తున్నారు.

**TELUGU:**

**వచ్చే విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని CBSE, ICSE, IB, తదితర విద్యా మండలి అనుబంధ పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి విద్యార్థులకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా బోధించాలని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, CBSE, ICSE, IB, తదితర విద్యా మండలి అనుబంధ పాఠశాలల్లో తెలుగులో బోధనను తప్పనిసరి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో రాష్ట్ర పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి బోధన, అభ్యాసం చట్టాన్ని తీసుకువచ్చిందని ఒక అధికారిక ప్రకటనలో తెలియజేశారు.**